


కొల్లాపూర్ పట్టణంలో ఆర్టీసీ బస్సులో ప్రయాణికులకు రంగు పూస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు


గద్వాల కొత్తహౌసింగ్ బోర్డు కాలనీలో నిర్వహించిన హోలీ వేడుకల్లో చిన్నారులు యువకులు


మహబూబ్‌నగర్ పట్టణంలో వీహెచ్‌పీ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు


మహబూబ్‌నగర్‌లోని తెలంగాణ చౌరస్తాలో వేడుకల్లో బీసీ సంఘం నాయకులు


మహబూబ్‌నగర్‌లోని రాంమందిర్ చౌరస్తాలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు


మహబూబ్‌నగర్‌లోని సుభాష్ నగర్‌లో వేడుకల్లో చిన్నారులు

రంగు పడింది


వనపర్తి పట్టణంలో హోలీ సంబురాల్లో పట్టణ ప్రజలు


మహబూబ్‌నగర్ పట్టణంలో నృత్యాలు చేస్తున్న యువతులు

రంగు పడింది.. హోలీ వేడుకలను ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా సోమవారం ఘనంగా జరుపుకున్నారు.. చిన్నా పెద్దా అని తేడా లేకుండా రంగులు చల్లుకుని సంబురాల్లో మునిగి తేలారు. డప్పు దరువులకు చిందేశారు. కొల్లాపూర్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు వేడుకల్లో పాల్గొన్నారు. మహబూబ్‌నగర్‌లో వివిధ సంఘాలు, మార్వాడీల ఆధ్వర్యంలో వేడుకలను ప్రత్యేకంగా నిర్వహించుకున్నారు.

- ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్


మహబూబ్‌నగర్‌లో డోలు వాయిస్తున్న యువకుడు

మహబూబ్‌నగర్‌లో పట్టణంలో హోలీ సంబురాల్లో మార్వాడీలు


జడ్చర్ల మండలం పెద్దఆదిరాల గ్రామంలో కామ దహనం చేస్తున్న గామస్థులు


మహబూబ్‌నగర్ పట్టణంలోని ఎస్‌వీఎస్ సమీపంలో వేడుకల్లో యువతులు


వనపర్తి పట్టణంలో సెల్ఫీ దిగుతున్న యువతులు


మహబూబ్‌నగర్‌లోని వేపురి గేరిలో..


కలర్ గన్‌తో చిన్నారి


మహబూబ్‌నగర్‌లో పట్టణంలో హోలీ సంబురాల్లో చిన్నారులతో మహిళ


వనపర్తి పట్టణంలో నృత్యం చేస్తున్న యువతులు

సేవకుడిలా పని చేస్తా

» కాంగ్రెస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లు రవి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మల్లురవి

జడ్చర్ల, మార్చి 25: రానున్న పార్లమెంట్ ఎన్నికల కోసం 50 రోజులు పార్టీ కొరకు కష్టపడి పని చేయాలని, ఆ తర్వాత ఐదేళ్లు మీ కోసం సేవకుడిగా పనిచేస్తానని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు, నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి డాక్టర్ మల్లురవి అన్నారు. జడ్చర్లలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో, దేశంలో నిశబ్ద, రక్తపాతం లేని విప్లవం ప్రజల్లో వచ్చిందన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌లకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి తనను గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ పరిధిలో స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రాలను ఏర్పాటు చేయిస్తానని, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా ప్రాజెక్టులలో పెండింగ్ 10 శాతం పనులను పూర్తి చేయించే బాధ్యత తీసుకుంటానని వెల్లడించారు. పాలమూరు ఎత్తిపోతల పథకానికి జాతీయ హోదా కోసం ఢిల్లీలో కొట్లాడుతానన్నారు. అలంపూర్, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, అచ్చంపేటల మీదుగా జాతీయ రహదారి నిర్మాణాన్ని చేపట్టి, నల్గొండ జాతీయ రహదారికి కలపాలని ఇప్పటికే కేంద్ర మంత్రి నితిన్‌గడ్కరీని కోరానన్నారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ప్రాంతం అంతా కృష్ణనదికి పరివాహకంగా ఉన్నందున నీటిపై ఆధార పడే పరిశ్రమలను తెస్తానన్నారు. నాగర్‌కర్నూల్‌లో పార్టీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి అన్ని వేళల్లో అందుబాటులో ఉంటానన్నారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను బీజేపీ ప్రభుత్వం కాలరాస్తోందని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు రిజర్వేషన్‌లు లేకుండా చేసేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. బీఆర్ఎస్ పార్టీని, ఆ పార్టీ అధినేత కేసీఆర్‌ను టార్గెట్‌గా చేసి ఆరోపణలు, విమర్శలు చేసిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, తాజాగా బీఆర్ఎస్ పార్టీలో చేరి గడిచిన పది సంవత్సరాలు స్వర్ణయుగమని చెప్పడం ఏంటని ప్రశ్నించారు. పదవుల కోసం నీచ రాజకీయం చేయడం ఆయనకే చెల్లించదన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గద్దెదించి, ఇండియా కూటమిని గెలిపించి, రాహుల్‌గాంధీని ప్రధాన మంత్రిని చేయడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఒబేదుల్లా కొత్వాల్, బుర్ల వెంకటయ్య, బుక్క వెంకటేశ్, అశోక్‌యాదవ్, మినాజ్ పాల్గొన్నారు.

విరబూసిన సీతా అశోక పుష్పం



మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని బొటానికల్ గార్డెన్‌లో సీతా అశోక పుష్పం విరబూసింది. అందుకు సంబంధించిన విషయాలను బొటానికల్ గార్డెన్ కోఆర్డినేటర్ డాక్టర్ సదాశివయ్య సోమవారం వివరించారు. సీతా అశోకను శాస్త్రీయంగా సరాక అశోక అంటారని తెలిపారు. చెట్టులోని ప్రతీభాగం ఔషధమేనని, అసోకారిస్టము అనే మందు తయారీకి వినియోగిస్తారని వివరించారు. బుద్దుడు అశోక చెట్టు కింద జన్మించాడని, మహవీరుడు అశోకవనంలో సన్యాసం స్వీకరించాడని పురాణాల్లో లిఖించబడి ఉందని తెలిపారు. రామాయణంలో సీతాదేవిని లంకలోని అశోకవనంలో రావణుడు బందీగా ఉంచాడని వెల్లడించారని చెప్పారు. యోగి వేమన విశ్వవిద్యాలయం లీడ్ బొటానికల్ గార్డెన్ నుంచి ఈ మొక్కను సేకరించినట్లు ఆయన వివరించారు.

- జడ్చర్ల

అనుమానాస్పదంగా మహిళ మృతి

జడ్చర్ల, మార్చి 25: జడ్చర్ల మండలం చెర్లపల్లి గ్రామంలో నాగర్‌కర్నూల్ జిల్లా లట్టుపల్లి గ్రామ పంచాయతీ ఎర్రగుంట తండాకు చెందిన రమావత్ ఫకీరమ్మ(53) అనుమానాస్పదంగా మృతి చెందింది. జడ్చర్ల ఎస్సై చంద్రమోహన్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎర్రగుంట తండాలో నివాసముంటున్న ఫకీరమ్మ ఈనెల 23న జడ్చర్ల మండలం మల్లెబోయిన్‌పల్లిలో ఉన్న కూతురు ఇంటికి వెళ్తున్నట్లుగా చెప్పి బయల్దేరింది. ఆదివారం చెర్లపల్లిలో అనుమానాస్పదంగా ఆమె మృతి చెందింది. కుమారుడు రమావత్ జహంగీర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తులో ఉంది.


నిలిచిన ఎత్తిపోత

» మధ్యలోనే ఆగిన మురుగు నీటి తరలింపు పనులు

» అలంపూర్‌లో రోడ్లపై పారుతున్న డ్రైనేజీ నీరు

» రూ.10 కోట్ల ప్రజా ధనం వృథా

అలంపూర్, మార్చి 25: జోగుళాంబ గద్వాల జిల్లా అలంపూర్ పట్టణంలో చేపట్టిన మురుగు నీటి ఎత్తిపోతల పథకం పనులు పూర్తి కాకపోవడంతో డ్రైనేజీ నీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దాంతో వాహనదారులు, బాటసారులు ఇబ్బందులు ఎదుర్కొంటుండగా, దుర్వాసనతో పట్టణ ప్రజలు అవస్థలు పడుతున్నారు. అనారోగ్యాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 1980లో శ్రీశైలం ప్రాజెక్టు నిర్మాణ సమయంలో మొత్తం 110 గ్రామాలు ముంపునకు గురైన విషయం తెలిసిందే. అదే విధంగా బ్యాక్ వాటర్ ద్వారా అలంపూర్ పట్టణం కూడా మునిగిపోతుందనే ఆలోచనతో దేవాలయాల పరిరక్షణ కోసం పట్టణానికి కిలో మీటరు దూరంలో తుంగభద్ర నది తీరాన రక్షణగా గోడ నిర్మించారు. ఈ గోడ కారణంగా వరద నీరు, పట్టణంలోని డ్రైనేజీల ద్వారా వచ్చే మురుగు నీరు తుంగభద్ర నదిలోకి వెళ్లే అవకాశం లేకపోవడంతో రక్షణ గోడ అంచున ఒక సంపును ఏర్పాటు చేశారు. వరద, డ్రైనేజీ నీరు ఆ సంపులోకి చేరగా.. అక్కడి నుంచి రెండు మోటార్ల ద్వారా నీటిని తుంగభద్ర నదిలోకి ఎత్తిపోసేవారు. 2009లో వచ్చిన వరదలకు సామర్థ్యానికి మించి నీరు పట్టణంలోకి చేరుకోవడంతో మోటార్లు పని చేయక పట్టణం ముంపునకు గురైంది. దీంతో అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం, నీటిని ఎత్తిపోసేందుకు మోటార్లు, పైపులైన్ల కోసం రూ.10 కోట్లు మంజూరు చేశారు. అలంపూర్ పట్టణ శివారులో డంపులను ఏర్పాటు చేసి, సంపు నుంచి పైపుల ద్వారా మురుగు నీరు అక్కడికి పంపించి శుద్ధి చేయాలని నిర్ణయించారు. శుద్ధి చేసిన నీటిని తుంగభద్ర నది తీరంలో వదలాలని ప్రణాళికలు రూపొందించారు. అలంపూర్ గ్రామ పంచాయతీగా ఉన్న సమయంలో ఇరిగేషన్ అధికారులు ఈ పనులను ప్రారంభించారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీలను కానీ డంప్‌లు సరిగా నిర్మించ లేదు. సంపు నుంచి డంప్ వరకు పైపు లైన్ పరిమాణం తక్కువగా ఉన్నవి, నాణ్యతలేని వేశారు. కొత్త మోటార్లు ఏర్పాటు చేయాల్సి ఉండగా.. చేయలేదు. డంపులలో ముళ్ల పొదలు, కంపచెట్లు పేరుకున్నాయి. ప్రస్తుతం అవి తాగుబోతులకు, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారాయి. నామమాత్రంగా పనులు చేసి, డబ్బులు కాజేశారన్న ఆరోపణలు ఉన్నాయి. అప్పటి నుంచి ఆ పనులు పెండింగ్‌లోనే ఉన్నాయి. తెలంగాణ ప్రభుత్వం వచ్చాక కొత్త పంపుల కోసం రూ.4 కోట్లు మంజూరు చేసింది. వాటితో పంపులను బిగించగా.. సంపు నుంచి వేసిన పైపులైన్ నాసిరకం, పరిమాణం తక్కువది కావడంతో మార్చాల్సి ఉంది. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి అండర్ డ్రైనేజీ ద్వారా మురుగు నీరు రోడ్లపైకి రాకుండా.. ఎత్తిపోసేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.


మురుగు నీరు నిల్వ ఉన్న సంపు


డంపులో మొలిచిన ముళ్ల కంప


పోలీస్ స్టేషన్ ముందు రోడ్డుపై పారుతున్న మురుగు నీరు

దుర్వాసన వస్తోంది..



అలంపూర్‌లో డ్రైనేజీ నీటిని ఎత్తిపోసేందుకు చేపట్టిన పనులు మధ్యలోనే వదిలేయడంతో అండర్ డ్రైనేజీల ద్వారా మురుగు నీరు రోడ్లపైకి చేరుతోంది. దుర్వాసన, దోమలు, పురుగులతో ఇబ్బందులు పడుతున్నాం. డెంగీ, మలేరియా వంటి విషజ్వరాల బారిన పడుతున్నాం. అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలి.

- వెంకటేశ్వర్లు, కట్టెలపేట, అలంపూర్

ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం



అలంపూర్ మునిసిపాలిటీగా ఏర్పడక ముందు ఇరిగేషన్ అధికారులు డ్రైనేజీని ఎత్తిపోసే పనులను చేపట్టి, మధ్యలోనే వదిలేశారు. ఉన్నతాధికారులతో మాట్లాడి పనులను పూర్తి చేయాలి. లేదంటే ఆ పనులను మునిసిపాలిటీకి అప్పగిస్తే పరిష్కారం లభిస్తుంది. నీటిని ఎత్తిపోయకపోవడంతో అండర్ డ్రైనేజీ నీరు రోడ్లపైకి చేరి, పట్టణ ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారు. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తా.

- మనోరమ, మునిసిపల్ చైర్ పర్సన్

పేకాటరాయుళ్ల అరెస్టు

» పట్టుకొనే క్రమంలో ఎస్సైకి స్వల్ప గాయాలు

అయిజ, మార్చి 25 : పేకాడుతున్న వ్యక్తులను అయిజ పోలీసులు అరెస్టు చేశారు. ఎస్సై విజయ్‌భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం జోగుళాంబ గద్వాల జిల్లాలోని అయిజ మునిసిపాలిటీ పరిధిలోని తుపతురాల గ్రామంలో పేకాడుతున్నారన్న సమాచారం మేరకు దాడులు చేశామని అన్నారు. సోమవారం రాత్రి 7:30 గంటల ప్రాంతంలో దాడులు చేసినట్లు తెలిపారు. దాడుల్లో నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. పట్టుబడిన వారి నుంచి రూ.2,900 నగదు, నాలుగు మొబైల్ ఫోన్లు, రెండు ద్విచక్ర వాహనాలు స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. మిగతా ఐదుగురు పరారీలో ఉన్నట్లు వివరించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కాగా, పారిపోతున్న వ్యక్తులను పట్టుకునే క్రమంలో ఎస్సై విజయ్ భాస్కర్‌కు స్వల్ప గాయాలు కావటంతో ప్రథమచికిత్స చేయించుకున్నట్లు సమాచారం.

ఎంపీటీసీ సభ్యులు లేరు.. ఎన్నికల సందడి లేదు..



జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయం

జడ్చర్ల, మార్చి 25 : స్థానిక సంస్థల ఎన్నికల సందడి ఉమ్మడి జిల్లాలోని అన్ని మండలాల్లో నెలకొనగా జడ్చర్ల మండలంలో అందుకు విరుద్ధంగా ఉంది. మహబూబ్‌నగర్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీగా ఉన్న కశిరెడ్డి నారాయణరెడ్డి పార్టీ మారడం, నిన్నటి సాధారణ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా గెలవడంతో ఎమ్మెల్సీ స్థానానికి రాజీనామా చేశారు. దీంతో ఎమ్మెల్సీ స్థానానికి ఈనెల 28న ఉప ఎన్నికలు జరుగనున్నాయి. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లుగా ఉన్న ఎంపీటీసీ సభ్యులు, జడ్పీటీసీ సభ్యులు, మునిసిపల్ కౌన్సిలర్లను ఎమ్మెల్సీ బరిలో నిలిచిన ప్రధాన పార్టీల అభ్యర్థులు క్యాంపునకు తరలించారు. జడ్చర్ల నియోజకర్గంలోని జడ్చర్ల మండలం మినహా అన్ని మండలాల ఎంపీటీసీ సభ్యులు క్యాంపునకు తరలివెళ్లారు. రాష్ట్ర వ్యాప్తంగా 2019లో స్థానిక సంస్థల ఎన్నికలు జరిగాయి. కాగా జడ్చర్ల మండలంలో కేవలం జడ్పీటీసీ స్థానానికి మాత్రమే ఎన్నికలు జరగగా, ఎంపీటీసీ స్థానాలకు ఎన్నికలు జరగలేదు. అప్పటికీ జడ్చర్ల మండలంలో ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు తమ పదవుల్లో కొనసాగడంతో ఎన్నికల ప్రక్రియను నిర్వహించలేదు. 2014లో జరిగిన ఎంపీటీసీ ఎన్నికల్లో గెలిచిన ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీని ఒక సంవత్సరం ఆలస్యంగా ఎన్నుకున్నారు. ఎంపీపీ పదవీకాలం ఐదు సంవత్సరాలు కొనసాగాలన్న నిబంధన ఉండడంతో 2019లో జరిగిన ఎన్నికల సందర్భంలో జడ్చర్ల మండలంలో ఎంపీపీ, ఎంపీటీసీ సభ్యులు తమ పదువుల్లో కొనసాగారు. ఎంపీపీ పదవీకాలం 2020లో పూర్తయినా, మళ్లీ ఎన్నికల ప్రక్రియ జరపకపోవడంతో నాటి నుంచి నేటి వరకు జడ్చర్ల మండలంలో ఎంపీటీసీ సభ్యులు లేని మండలంగా కొనసాగింది. ప్రస్తుతం జరుగుతున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో జడ్చర్ల మండలంలో ఎంపీటీసీ సభ్యులు లేకపోవడంతో ప్రధాన పార్టీల అభ్యర్థుల విజయావకాశాలపై ప్రభావం చూపనున్నది.

పారిశుధ్య కార్మికుల వేతన వెతలు



మదనాపురంలో పారిశుధ్య పనులు చేస్తున్న జీపీ కార్మికులు

- నాలుగు నెలలుగా అందని వేతనాలు
- గ్రామాల పరిశుభ్రతలో వారి పాత్ర కీలకం
- జిల్లాలో 1,028 మంది జీపీ కార్మికులు
- జీతాలు లేక అప్పుల ఊబిలోకి
- ఇలాగైతే సమ్మెకు దిగుతామని హెచ్చరిక

మదనాపురం, మార్చి 25 : గ్రామాల పరిశుభ్రతలో పారిశుధ్య కార్మికుల పాత్ర కీలకం. ఉదయమే ఇంటి వద్దకు వచ్చి చెత్త సేకరణ చేసి డంపింగ్ యార్డుకు తరలిస్తారు. మురుగును చూస్తేనే చీదరించుకునే రోజుల్లో నిత్యం మురుగునీటితో పాటు, వ్యర్థాలను తొలగిస్తూ గ్రామాలను వారు అలంకార ప్రాయంగా మారుస్తున్నారు. ప్రభుత్వం చేపట్టే పలు కార్యక్రమాల్లో పంచాయతీ సిబ్బంది పాల్గొని విజయవంతం చేస్తున్నారు. అలాంటి కార్మికులకు కష్టం రానీయకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. జిల్లాలోని 225 గ్రామ పంచాయతీల్లో సుమారు 1,028 మంది కార్మికులు పని చేస్తున్నారు. వీరికి నెలకు రూ.9500 వేతనం అందుతోంది. కానీ గత నాలుగు నెలలుగా వేతనాలు అందకపోవడంతో కుటుంబ పోషణ భారంగా మారుతోందని వారు వాపోతున్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు ప్రతీనెల ఒకటవ తేదీన వేతనాలు వేస్తున్న ప్రభుత్వం కార్మికులు కష్టాలు కన్పించకపోవడం బాధాకరం. సకాలంలో వేతనాలు రాకపోవడంతో వారు అప్పులు చేసి జీవనం సాగిస్తున్నారు. ప్రభుత్వం స్పందించకపోతే పనులు నిలిపివేసి ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరిస్తున్నారు.

త్వరలో వేతనాలు అందుతాయి



పారిశుధ్య కార్మికులకు గత నాలుగు నెలలుగా వేతనాలు రాలేదు. సర్పంచుల పదవీకాలం ముగియడంతో ప్రత్యేకాధికారులను నియమించినా చెక్‌పవర్ రావడానికి ఆలస్యమైంది. జమ చేస్తాం.

- పుష్ప, మండల పంచాయతీ అధికారి, మదనాపురం

ప్రతీనెల ఒకటవ తేదీనే వేతనాలు ఇవ్వాలి



ఉద్యోగులకు ఇస్తున్నట్లు మాకు ఒకటవ తేదీనే వేత నాలు విడుదల చేయాలి. పంచాయతీల నిధులతో సంబంధం లేకుండా వేతనాలకు ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలి. వారంలో వేతనాలు రాకపోతే పారిశుధ్య పనులు నిలిపివేస్తాం.

- బొబ్బిలి నిక్సన్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు

రెండు రోజుల వ్యవధిలోనే తల్లీ, కుమారుడి మృతి

గట్టు మార్చి 25 : రెండు రోజుల వ్యవధిలోనే తల్లి, కుమారుడు మృతి చెందిన సంఘటన జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఈ ఘటనకు సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గట్టు మండల కేంద్రానికి చెందిన మఠం అదేమ్మ(80) ఆదివారం మృతి చెందడంతో ఆమె అంత్యక్రియలు అదేరోజు సాయంత్రం పూర్తి చేశారు. సోమవారం ఆమె కుమారుడు మఠం బుదెప్ప(65) మృతి చెందాడు. తల్లి మృతి చెందిన వెంటనే కుమారుడు మృతి చెందడంతో అటు కుంటుంబంలో, ఇటు గట్టులోనూ విషాదఛాయలు అలుముకున్నాయి. తల్లీ, కుమారుడు మృతిపై పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

108లో చెంచు మహిళ ప్రసవం

అమ్రాబాద్, మార్చి 25 : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం బీకే ఉప్పునుంతల గ్రామానికి చెందిన ఆదిమ జాతి చెంచు మహిళ ఎం.వెంకటమ్మకు ఆదివారం రాత్రి పురిటి నొప్పులు రాగా 108లో పురుడు పోసుకుంది. అమ్రాబాద్, అచ్చంపేట ప్రభుత్వాసుపత్రులకు తరలించగా మెరుగైన వైద్య సదుపాయాల కోసం జిల్లా ఆస్పత్రికి తరలించాలని చెప్పడంతో వారు అదే అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు అధికం కావడంతో ప్రసవించింది. ఈఎంటీ మల్లేష్, పైలెట్ కిరణ్‌లు ఈ మహిళకు ప్రసవం చేశారు. అనంతరం సోమవారం ఉదయం తల్లీ బిడ్డలను అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించగా, వారిద్దరూ ఆరోగ్యంగానే ఉన్నారని ఈఎంటీ విలేకరులకు తెలిపారు. అర్ధరాత్రి పురటి నొప్పులు రావడంతో తాము అమ్రాబాద్, అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రులకి తీసుకుపోయినా సరైన స్పందన లేకపోవడంతో ఇబ్బందు లకు గురికావాల్సి వచ్చిందని వెంకటమ్మ భర్త లింగయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

పంచాయతీ భవన శిలాఫలకం దిమ్మె కూల్చివేత

జడ్చర్ల, మార్చి 25 : మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలం తంగెళ్లపల్లి గ్రామ పంచాయతీలో పంచాయతీ భవన నిర్మాణానికి సంబంధించిన శిలాఫలకం, దిమ్మెను ఆదివారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు కూల్చివేశారు. అందుకు సంబంధించిన ఫొటోలు సోమవారం గ్రామస్థులు సోషల్ మీడియాలో షేర్ చేశారు. గ్రామ పంచాయతీ భవనం నిర్మాణానికి సంబంధించి అప్పటి ఎమ్మెల్యే డాక్టర్ సి.లక్ష్మారెడ్డి శంకుస్థాపన చేశారని వారు గుర్తు చేశారు. గ్రామంలో జరిగిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన శిలాఫలకాన్ని కూల్చివేయడం దారుణమని, ఘటనపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

కంకర టిప్పర్ బోల్తా, డ్రైవర్‌కు గాయాలు

గట్టు, మార్చి 25 : జోగుళాంబ గద్వాల జిల్లా గట్టు మండలం సల్కాపురం గ్రామ దారిలో కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ సోమవారం సాయంత్రం అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదంలో డ్రైవర్‌కు గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. భారత్‌మాల రహదారికి తారాపురం క్వారీ నుంచి టిప్పర్లు నిత్యం కంకరను ఈ రహదారి గుండానే తరలిస్తుంటాయి. అయితే సోమవారం ఓ టిప్పర్ కంకర తీసుకపోతుండగా అదుపు తప్పి రోడ్డు పక్కనే ఉన్న వరి పొలాల్లో బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్‌కు గాయాలు కావడంతో అతన్ని చికిత్స నిమిత్తం అసుపత్రికి తరలించినట్లు సమాచారం. ఈ విషయంపై ఎస్సై రామకృష్ణని సంప్రదించగా ఎలాంటి ఫిర్యాదు అందలేదన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యం



గుర్తు తెలియని వృద్ధుడి శవం

గద్వాల క్రైం, మార్చి 25 : జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలోని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తి శవం లభ్యమైంది. పట్టణ రెండవ ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. గద్వాల పట్టణంలోని అంబేడ్కర్ చౌక్‌లో గుర్తు తెలియని వృద్ధుడు(60) మృతి చెందాడని సమాచారం రావడంతో ఆ శవాన్ని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రికి తరలించ మన్నారు. పోస్టుమార్టం పూర్తయ్యిందని మృతుడికి చెందిన వారెవరైనా ఉంటే తమను సంప్రదించాలని ఆయన తెలిపారు.

అయిజలో అగ్నిప్రమాదం

- చొప్పదొడ్లకు తప్పిన ముప్పు

అయిజ, మార్చి 25 : జోగుళాంబ గద్వాల జిల్లా అయిజలో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. నీటిలో పెరిగిన జమ్ముకు అంటుకున్న మంటలు పక్కనే ఉన్న చొప్పదొడ్లకు అంటుకున్నాయి. తేరుకున్న జనం అప్రమత్తమై నీటి కడువలతో మంటలను ఆర్పారు. అయిజ పట్టణంలోని ఎస్సీ కాలనీలో మడికట్ట ప్రాంతంలో సోమవారం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో జమ్ముకు నిప్పంటుకుంది. ఈ జమ్ము దాదాపు పదెకరాల మేర విస్తీర్ణంలో నీటి గుంటలో పెరిగింది. దీని పక్కనే జీవరత్నం, దుబ్బ జమ్మన్నతో పాటు, మరికొంత మంది రైతుల చొప్పదొడ్లు, అందులో పశువులు, పశుగ్రాసం ఉంది. ఈ నీటిలో పెరిగిన జమ్ముకు నిప్పు అంటుకున్న ఘటనను గమనించిన జనం హుటాహుటిన నీటి కడువలతో వెళ్లారు. అక్కడే కుంటలో ఉన్న నీటిని తీసి మంటలను ఆర్పారు. త్రుటిలో ఈ సంఘటన నుంచి బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. వేసవిలో ఇలాంటి ఘటనలు మరిన్ని చోటుచేసుకునే ప్రమాదం ఉన్న నేపథ్యంలో ప్రజాప్రతినిధులు పరిష్కార మార్గం వెతికి ప్రమాద ప్రాంతాలను గుర్తించి పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అట్టహాసంగా అమ్మవారి కల్యాణం

- తరలివచ్చిన భక్తులు
- కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు



అమ్మవారి మంగళసూత్రాన్ని చూపిస్తున్న ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్‌కుమార్

మహబూబ్‌నగర్ రూరల్, మార్చి 25 : తెలంగాణ తిరుపతిగా పేరుగాంచిన మన్యంకొండ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు కొనసాగాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అమ్మవారి కల్యాణాన్ని ఘనంగా ఘనంగా నిర్వహించారు. ఉదయం అమ్మవారికి, కొండ పైన స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమి, సోమవారం పర్వదినం కావడంతో అమ్మవారి కల్యాణాన్ని పురస్కరించుకొని భక్తులు వేలాదిగా తరలివచ్చారు. ఆలయ ధర్మకర్త అళహరి మధుసూదన్‌కుమార్ అమ్మవారి కల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా అర్చకుల వేదమంత్రాల నడుమ ఘనంగా నిర్వహించారు. అనంతరం అమ్మవారిని పల్లకీ సేవలో గ్రామోత్సవాన్ని నిర్వహించారు. భక్తులు అమ్మవారి కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. రాత్రి గరుడవాహన సేవ నిర్వహించారు. కార్యక్రమంలో మన్యంకొండ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, దేవాదాయ శాఖ కమిషనర్ శ్రీనువాసరాజు, అర్చకులు, మన్యంకొండ బ్రహ్మోత్సవ ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



అమ్మవారి కల్యాణోత్సవాన్ని తిలకించేందుకు తరలివచ్చిన భక్తులు

రమణీయం కందూరు రామలింగేశ్వరుని రథోత్సవం

అడ్డాకుల, మార్చి 25 : మహబూబ్‌నగర్ జిల్లా కందూరు రామలింగేశ్వరుని బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం తెల్లవారుజామున స్వామివారి రథోత్సవం ఘనంగా నిర్వహించారు. టీటీడీ శైవాగమ వేదపండితుడు పుల్లేటికుర్తి గణపతిశర్మ, ప్రధాన పూజారి మణికంఠ శివాచార్య, ఆయన శిష్యబృందం ఆధ్వర్యంలో స్వామివారి రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఆదివారం రాత్రి నుంచి దేవాలయంలో నిత్యోపాసన, రుద్రహోమం, బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. కోనేరులో ఉత్సవ విగ్రహాలతో తెప్పోత్సవం నిర్వహించారు. దేవాలయం దగ్గర తయారుచేసిన కుంభాన్ని కమ్మరి, వడ్ల కులస్తులు బోనంతో తెచ్చి తేరుముందు ఉంచగా పూజారులు హోమం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులు స్వామివారి నామస్మరణ చేస్తూ రథాన్ని లాగారు. కార్యక్రమంలో కందూరు గ్రామ పెద్దలు, మహిళలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



కందూరు రామలింగేశ్వరుని రథాన్ని లాగుతున్న భక్తులు

కొనసాగుతున్న లక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు

- స్వామివారికి ఘనంగా గజవాహన సేవ
- దర్శించుకున్న ఎంపీ రాములు

ఉప్పునుంతల, మార్చి 25 : నాగర్‌కర్నూల్ జిల్లా ఉప్పునుంతల మండలం మామిళ్ళపల్లి గ్రామంలో లక్ష్మీనర్సింహస్వామి బ్రహోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం నాల్గువ రోజు స్వామివారికి గజవాహన సేవ నిర్వహించారు. నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు గజవాహన సేవలో పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాసరావు, చైర్మన్ మాధవరావు రాజల్‌రావు, మాజీ చైర్మన్ రామస్వామి, నాయకులు మంగానాయక్, బ్రహ్మచారి తదితరులున్నారు.



గజవాహన సేవలో స్వామి



స్వామి వారికి పూజలు చేస్తున్న ఎంపీ రాములు

కనుల పండువగా వెంకన్న కల్యాణం

- హాజరైన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి

బిజినేపల్లి, మార్చి 25 : నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం వట్టెం శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా వెంకన్న స్వామి కల్యాణోత్వవాన్ని సోమవారం కన్నుల పండుగగా నిర్వహించారు. స్వామి అమ్మవార్ల కల్యాణోత్సవానికి ఎమ్మెల్సీ కూచకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి మల్లురవిలు హాజరయ్యారు. గోవింద నామస్మరణ మధ్య కొనసాగిన కల్యాణం ఆద్యంతం వైభవంగా కొనసాగింది. దేవస్థాన స్థానాచార్యులు సముద్రాల శ్రీమన్నారాయణచార్యులు, ప్రధాన అర్చకుడు ప్రసాదాచార్యుల ఆధ్వర్యంలో అర్చక బృందం కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారి దీక్ష భరత నాట్య ప్రదర్శన, భజన బృందాల గేయాలు ఆహుతులను అలరించాయి.

స్వామివారి కల్యాణానికి తలంబ్రాలు, పట్టు వస్త్రాలను కల్యాణ కైంకర్యపరులు సండడి రంగారెడ్డి సోదరులు, స్టేట్ బార్ కౌన్సిల్ చైర్మన్ అనంత నరసింహారెడ్డి దంపతులు, ఉప్పల కృష్ణయ్య దంపతులు సమర్పించారు. ఈ సందర్భంగా భక్తులకు ఉచిత అన్నదానం చేపట్టారు. కార్యక్రమంలో సండడి ప్రతాప్‌రెడ్డి, సండడి నరేందర్‌రెడ్డి, దేవేందర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, భాస్కరాచారి, బండారు రాజశేఖర్‌రెడ్డి, అమృత్‌రెడ్డి, అర్చక బృందం సభ్యులు నరసింహాచార్యులు, సంతోష్‌లతో పాటు, ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



వట్టెం వెంకన్నస్వామి కల్యాణోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి

మనో సంకల్ప సాధనకు ఆధ్యాత్మికత సరైన మార్గం

- కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి

మనో సంకల్ప సాధనకు ఆధ్యాత్మికత సరైన మార్గమని నాగర్‌కర్నూల్ నియోజకవర్గ కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి మల్లురవి అన్నారు. మండలంలోని వట్టెం వెంకన్న స్వామి ఆలయంలో సోమవారం స్వామివారి కల్యాణోత్సవంలో ఎమ్మెల్సీ కూచుకుళ్ల దామోదర్‌రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్‌రెడ్డిలతో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. గతంలో ఎంపీగా ఉన్నప్పుడు ఆలయ వ్యవస్థాపకుడు సండడి రంగారెడ్డి కోరిక మేరకు జవహర్ నవోదయ విద్యాలయాన్ని ఆలయ ప్రాంగణంలోనే ఏర్పాటుచేసి నిరుపేద విద్యార్థులకు ఉన్నత విద్య అందిస్తున్నట్లు తెలిపారు. ఎమ్మెల్సీ దామోదర్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా పథకాల రూపకల్పన అమలు చేస్తోందని కొనియాడారు. ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్‌రెడ్డి మాట్లాడుతూ నాగర్‌కర్నూల్ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధిని పరుగులు పెట్టించి రాష్ట్రంలోనే ఉత్తమ నియోజకవర్గంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్తానని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ అమృత్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మిద్దె రాములు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, మాన్య నాయక్, భగవంత్‌గౌడ్, రామకృష్ణ ఉన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి



నారయ్య (ఫైల్)



తిరుపతయ్య (ఫైల్)

చారకొండ, మార్చి 25 : నాగర్‌కర్నూల్ జిల్లా చారకొండ మండలంలోని జూపల్లి గ్రామానికి చెందిన అర్కంటి నారయ్య(39) నాలుగురోజుల క్రితం కిడ్నీ వ్యాధితో బాధపడుతూ హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున మృతి చెందాడు. మృతునికి భార్య, పిల్లలున్నారు. అదే గ్రామానికి చెందిన కడారి తిరుపతయ్య(40) ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో చికిత్స కోసం కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మధ్యాహ్నం మృతి చెందాడు. గ్రామానికి చెందిన పలువురు నాయకులు మృతదేహాలకు నివాళులు అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

జాతీయ స్థాయి సబ్ జూనియర్ పోటీలకు

మక్తల్ విద్యార్థుల ఎంపిక



క్రీడాకారులతో డీసీసీబీ చైర్మన్ నిజాంపాష

మక్తల్, మార్చి 25 : జాతీయ స్థాయి సబ్ జూనియర్ పోటీలకు నారాయణపేట జిల్లా మక్తల్ విద్యార్థులు ఎంపికయ్యారు. ఈనెల 17న మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో జరిగిన రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ బాలబాలికల షూటింగ్ బాల్ పోటీల్లో నారాయణపేట జిల్లా నుంచి బాలబాలికలు మధుప్రియ, మహేశ్వరి, దీక్షిత, జస్వంత్, రంజిత్‌కుమార్‌లు ఎంపికయ్యారని షూటింగ్‌బాల్ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి సీహెచ్.ఐలయ్యలు ప్రకటించారని షూటింగ్ బాల్ జిల్లా ప్రధాన కార్యదర్శి, విశ్రాంత పీఈటీ గోపాలం తెలిపారు. షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు ఈనెల 28 నుంచి 31 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రం గజియాబాద్ జిల్లా కేంద్రంలో జరిగే జాతీయ స్థాయి సబ్ జూనియర్ పోటీల్లో ఆడుతారన్నారు. ఎంపికైన క్రీడాకారులను ఉమ్మడి జిల్లా డీసీసీబీ చైర్మన్ నిజాంపాష సన్మానించారు. కార్యక్రమంలో షూటింగ్‌బాల్ కోచ్ రమేష్‌కుమార్, పీఈటీలు అంబ్రేష్, దామోదర్, వెంకటేష్‌లు పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహన తనిఖీలు

- రూ.నాలుగు లక్షల 55 వేలు స్వాధీనం



స్వాధీన పరుచుకున్న నగదుతో సీఐ శివకుమార్, ఎస్సై నరేందర్

ఆత్మకూరు, మార్చి 25 : పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్నందున ఆత్మకూరు మండల పరిధిలోని పరమేశ్వరస్వామి చెరువు కట్ట వద్ద సీఐ శివకుమార్, ఎస్సై నరేందర్‌లు సోమవారం ముమ్మరంగా వాహన తనిఖీలు చేపట్టారు. కొత్తకోట వైపు నుంచి సీసీ కుంట వెళ్తున్న బొలేరో వాహనాన్ని తనిఖీ చేయగా ముగ్గురు వ్యక్తుల నుంచి నాలుగు లక్షల యాభై ఐదు వేల రూపాయలను పట్టుకున్నట్లు వారు తెలిపారు. అదేవిధంగా, మద్దూరు మండలం నిర్జంత గ్రామం నుంచి ఎరుకలి బాలరాజు లక్షా 75 వేల రూపాయలు, అలాగే దామరగిద్ద మండలం నారాయణ పేట జిల్లా వాసి ఎరుకలి నరసింహులు నుంచి రూ.లక్షా 60 వేలు, దామరగిద్ద మండలం కాన్కుర్తి గ్రామానికి చెందిన ఎరుకలి వెంకటప్ప నుంచి రూ.లక్షా 20 వేలు స్వాధీనం చేసుకున్నట్లు వారు వివరించారు. నగదుకు సంబంధించి ఎలాంటి రశీదులు కానీ, బిల్స్ చూపకపోవడంతో వాటిని స్వాధీనం చేసుకున్నట్లు సీఐ శివకుమార్, ఎస్సై నరేందర్‌లు తెలిపారు. ఎన్నికల కోడ్ ఉన్నందున భారీగా నగదు మద్యం పట్టుబడే అవకాశం ఉంది. కావునా అందులో భాగంగానే వాహనాల తనిఖీ ముమ్మరంగా చేపట్టినట్లు తెలిపారు. ఎవరైనా నగదు తీసుకువెళ్తుంటే వాటికి సంబంధించిన రసీదులో బిల్లులు తప్పనిసరిగా ఉండాలి. లేనిపక్షంలో వాటిని స్వాధీనం పరుచుకుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా తిరుమలనాథస్వామి రథోత్సవం

- కల్యాణానికి హాజరైన బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ



డీకే అరుణను ఆశీర్వదిస్తున్న అర్చకులు

హన్వాడ, మార్చి 25 : మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలంలోని మాదారం యారోనిపల్లిగుట్టపై వెలసిన శ్రీరాకమకొండ తిరుమలనాథస్వామి జాతర ఉత్సవాల్లో భాగంగా సోమవారం రాత్రి స్వామివారి రథోత్సవం కన్నులపండువగా జరిగింది. మంగళవారం తెల్లవారుజాము వరకు రథోత్సవం కొనసాగింది. అంతకుముందు స్వామివారి కల్యాణాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి బీజేపీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి డీకే అరుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట పార్టీ జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

వరి పంటకు ట్రాక్టర్‌తో నీరు



ట్యాంకర్‌తో వరి పంటకు నీరు అందిస్తున్న రైతు మోహన్

హన్వాడ, మార్చి 25 : భూగర్భ జలాలు అడుగంటిపోవడంతో రైతులు చేతికి వచ్చిన పంటను కాపాడుకునేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండలం నాయినోనిపల్లి గ్రామానికి చెందిన రైతు అక్కపల్లి మోహన్ ట్రాక్టర్ ట్యాంకర్ల ద్వారా నీటిని తెచ్చి పంటకు అందిస్తున్నాడు. వారంరోజుల నుంచి ట్రాక్టర్ ట్యాంకర్లతో నీటిని తెచ్చి పంటను కాపాడుకుంటున్నాడు.

పాఠ్యాంశాలపై అవగాహన పెంచుకోవాలి

▸ పాఠశాల వార్షికోత్సవంలో ఎంఈవో సురేష్



జ్యోతిప్రజ్వలన చేస్తున్న ఎంఈవో, డీసీఈబీ కార్యదర్శి

గద్వాల టౌన్, మార్చి 25 : పరీక్షల్లో ఉత్తీర్ణత కోసం బట్టీ పట్టే విధానాన్ని వీడి, పాఠ్యాంశాలపై పూర్తిస్థాయిలో అవగాహన పెంచుకోవాలని ఎంఈఓ సురేశ్ విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని బెటర్ లైఫ్ మోడల్ స్కూల్ రెండవ వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఎంఈవో, డీసీఈబీ సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి, గద్వాల పట్టణ, రూరల్ ఎస్ఐలు రాము, శ్రీకాంత్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీసీఈబీ సెక్రటరీ ప్రతాప్‌రెడ్డి మాట్లాడుతూ పరీక్షలపై విద్యార్థులు ఆందోళనకు గురికాకుండా, ప్రణాళికాబద్ధంగా సమాయత్తం కావాలన్నారు. ఇందుకు ఉపాధ్యాయులు ఇచ్చే సూచనలను పాటించాలన్నారు. ఎస్ఐలు మాట్లాడుతూ విద్యార్థులు సెల్‌ఫోన్లకు, బైక్‌లకు దూరంగా ఉండాలని, క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సూచించారు. ఈ విషయంపై తల్లిదండ్రులు పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకున్నది. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ సంజీవరెడ్డి, ప్రిన్సిపాల్ సౌజన్య ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వర కల్యాణం



స్వామివారికి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మల్దకల్, మార్చి 25 : పౌర్ణమిని పురస్కరించుకొని ఆదిశిలా క్షేత్రంలోని స్వయంభువు శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో చైర్మన్ ప్రహ్లాదరావు ఆధ్వర్యంలో సోమవారం స్వామివారి కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామి వారికి పంచామృతాభిషేకం, అలంకరణ సేవ నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం మహామంగళ హారతి ఇచ్చారు. అనంతరం ప్రత్యేకంగా అలంకరించిన మండపంలో ఉత్సవమూర్తులను ఉంచి అర్చకుల మంత్రోచ్చారణ, మంగళవాయిద్యాల నడుమ కల్యాణ వేడుక నిర్వహించారు. ఆలయ చైర్మన్, ఈవో సత్యచంద్రారెడ్డిల ఆధ్వర్యంలో భక్తులకు అవసరమైన ఏర్పాట్లు చేశారు.

అలంపూర్‌కు పోటెత్తిన భక్తులు



అమ్మవారి దర్శనానికి బారులుతీరిన భక్తులు

అలంపూర్, మార్చి 25 : ఐదవ శక్తి పీఠం అలంపూర్ జోగుళాంబ, బాల బ్రహ్మేశ్వరస్వామి ఆలయాలు ఆది, సోమ వారాలు భక్తులతో కిటకిటలాడాయి. రెండు రోజులు సెలవుదినాలు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు క్షేత్రానికి చేరుకున్నారు. రద్దీ ఎక్కువ కావడంతో స్వామి, అమ్మవార్ల దర్శనం కోసం గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాల్సి వచ్చింది. స్వామి వారికి అర్చకులు అభిషేకం, అమ్మవారికి త్రిశతి, ఖడ్గమాల తదితర విశేష పూజలు నిర్వహించారు. భక్తులు ప్రత్యేక పూజలు చేసి చీర, సారె సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం మహామంగళ హారతి ఇచ్చారు.

గోమాతకు ప్రత్యేక పూజలు



గోమాతకు పూజలు చేస్తున్న మహిళలు

వడ్డేపల్లి, మార్చి 25 : శాంతినగర్ శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సోమవారం గోమాతకు ప్రత్యేక పూజలు చేశారు. హోలీ పండుగను పురస్కరించుకొని గోమాతకు రంగులు పూశారు. అనంతరం అర్చకుడు వినయ్ కౌశిక్ శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. కార్యక్రమంలో గో సేవా సమితి అధ్యక్షుడు ఇటుకూరి శ్రీనివాసులు, పూర్ణిమ దంపతులు, కార్యదర్శి మాణిక్ వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడు జైని లక్ష్మణస్వామి దంపతులు, గొంగల్ల వెంకటరాములు, గుంతరంగయ్య, మహానంది, కుర్వ వెంకటేశ్వర్లు దంపతులు, టెలిఫోన్ కృష్ణుడు, రామచంద్రుడు, వడ్డేపల్లి శ్రీనివాస్ రెడ్డి, జిల్లేడుదిన్నె వెంకటేశ్వరరెడ్డి, తిమ్మప్ప, దొంతు విజయకుమారి, జైని ప్రభావతి, కల్వ విజయ, నరహరి శాంత, పద్మావతి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

రాజోలి, జనవరి 25 : పౌర్ణమి సందర్భంగా మండల కేంద్రంలోని కోట వీధిలో వెలసిన వైకుంఠ నారాయణ స్వామి ఆలయంలో సోమవారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం నిర్వహించారు. సాయంత్రం 6.30 గంటలకు రథోత్సవం నిర్వహించారు. ఆలయం చుట్టూ రథాన్ని ఊరేగించి, స్వామి వారికి మహామంగళహారతి ఇచ్చారు. కార్యక్రమంలో విష్ణుప్రతాప్, శ్రీనివాసులు, వీరేష్, లక్ష్మీనారాయణ దంపతులు పాల్గొన్నారు.

కనుల పండువగా కల్యాణోత్సవం



కల్యాణ వేడుక నిర్వహిస్తున్న అర్చకులు

గద్వాల, మార్చి 25 : పౌర్ణమి సందర్భంగా పట్టణ సమీపంలోని నదీ అగ్రహారం వద్దనున్న వేంకటేశ్వర స్వామి ఆలయంలో సోమవారం కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. సాయంత్రం పల్లకీ సేవ నిర్వహించారు. వేడుకను తిలకించేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు.



గద్వాల కొత్త హౌసింగ్ బోర్డు కాలనీలో హోలీ వేడుకల్లో ఓ కుటుంబం



గద్వాల పాతహౌసింగ్‌బోర్డ్ కాలనీలో హోలీ వేడుకలు



రాజోలిలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో ఉట్టి కొడుతున్న మహిళ

కలర్‌ఫుల్ సంబురాలు

▸ ఉత్సాహంగా హోలీ వేడుకలు ▸ రంగుల్లో మునిగితేలిన జనం ▸ నృత్యాలతో సందడి చేసిన యువతీ యువకులు, చిన్నారులు



ఉండవల్లిలో రంగులు చల్లుకుంటున్న చిన్నారులు

గద్వాల టౌన్/ న్యూటౌన్/ గట్టు/ ధరూరు/ ఉండవల్లి/ అలంపూర్‌చౌరస్తా/ అయిజ/ ఇటిక్యాల/ మానవపాడు/ రాజోలి, మార్చి 25 : హోలీ పండుగను సోమవారం జిల్లా ప్రజలు సంబురంగా నిర్వహించుకున్నారు. మునిసిపాలిటీలు, మండల కేంద్రాలతో పాటు గ్రామాల్లో చిన్నా, పెద్దా, ఆడా, మగ తేడా లేకుండా రంగుల్లో మునిగితేలారు. ఉదయం తొమ్మిది గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వీధుల్లో యువతీ యువకులు, చిన్నారులు రంగులు చల్లుకుంటూ, కేరింతలు కొడుతూ, నృత్యాలు చేస్తూ సందడి చేశారు. చిన్నారులు గుంపులుగా తిరుగుతూ రంగులు చల్లుకున్నారు. జిల్లా కేంద్రంలోని ఐడీఎస్ఎంటీ కాలనీలో మహిళలు, యువకులు నృత్యాలు చేశారు. జయశంకర్ యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో హోలీ సంబురాలు నిర్వహించారు. హోలీకి ముందు రోజు ఆదివారం రాత్రి కామదహనం నిర్వహించారు. గట్టు మండల కేంద్రమైన గట్టుతో పాటు మాచర్ల, బల్గెర, ఇందువాసి, మిట్టదొడ్డి, తుమ్మలపల్లి, గొర్ల ఖాన్‌దొడ్డి, తదితర గ్రామాల్లో హోలీ పండుగను ఘనంగా జరుపుకున్నారు.. వడ్డేపల్లి మునిసిపాలిటీ కేంద్రంతో పాటు గ్రామాల్లో సోమవారం హోలీ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ధరూరు మండల కేంద్రంలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహిం చుకున్నారు. ఆదివారం రాత్రి మండల కేంద్రంలోని పాత బస్టాండ్ సమీపంలో కామ దహనం చేశారు. ఉండవల్లి మండల కేంద్రంతో పాటు కంచుపాడు, తక్కశిల, ప్రాగటూర్, చిన్న ఆముదాలపాడు, బైరాపురం, బస్వాపురం, అలంపూర్ చౌరస్తా, పుల్లూరు, కలుగొట్ల, మెన్నిపాడు, బొంకూరు గ్రామాల్లో హోలీ సంబురాలు ఘనంగా జరుపుకున్నారు. అయిజ, ఇటిక్యాల, మానవపాడు మండలాల్లో హోలీ పండుగను సంబురంగా నిర్వహించుకున్నారు. రాజోలి మండల కేంద్రంలోని శ్రీరామ్‌నగర్ కాలనీలో నిర్వహించే ఉట్టి కొట్టే పోటీలో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు.



అయిజలో కేరింతలు కొడుతున్న చిన్నారులు



అయిజలో రంగులు చల్లుకుంటూ నృత్యం చేస్తున్న చిన్నారులు



ధరూరు మండల కేంద్రంలో వేడుకల్లో పాల్గొన్న యువకులు



గద్వాల గంజిపేటలో నిర్వహించిన సంబురాల్లో యువకులు



గద్వాల ఐడీఎస్ఎంటీ కాలనీలో నృత్యం చేస్తున్న యువకులు

విహారయాత్రకు ప్రజాప్రతినిధులు

▸ జడ్పీ చైర్‌పర్సన్ సరిత ఆధ్వర్యంలో హైదరాబాద్‌కు తరలిన కాంగ్రెస్ నాయకులు ▸ 28న పోలింగ్ కేంద్రానికి చేరుకునేలా ప్లాన్

గద్వాల/ధరూరు/ అయిజ, మార్చి 25 : ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో క్యాంపు రాజకీయాలు జోరందుకున్నాయి. మూడు రోజుల క్రితం బీఆర్‌యస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీ సభ్యులు గోవా టూర్‌కు బయలు దేరి వెళ్లారు. సోమవారం కాంగ్రెస్ పార్టీకి చెందిన కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, ఇతర ప్రజా ప్రతినిధులు జడ్పీ చైర్‌పర్సన్ సరిత ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రిసార్ట్‌లకు వెళ్లారు. వారంతా ఈ నెల 28న నేరుగా పోలింగ్ కేంద్రానికి చేరుకోనున్నారు. ధరూరుకు చెందిన ప్రజాప్రతినిధులు సోమవారం హైదరాబాద్ విమానాశ్రయం నుంచి గోవాకు బయలుదేరి వెళ్లారు. వారిలో నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గం బీఆర్ఎస్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణకుమార్‌తో పాటు ధరూరు మండల వైస్ ఎంపీపీ సుదర్శన్ రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు డీఆర్ విజయ్‌కుమార్, సర్పంచుల సంఘం మాజీ అధ్యక్షుడు రఘువర్ధన్‌రెడ్డి, ప్రభాకర్‌గౌడ్, ఎంపీటీసీ సభ్యుడు గార్లపాడు రాఘవేంద్రరెడ్డి ఉన్నారు. అయిజకు చెందిన బీఆర్ఎస్ కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు ఈనెల 21న రాత్రి విహార యాత్రకు వెళ్లారు. వారందరూ ఈ నెల 27న కర్నూలుకు చేరుకోనున్నారు. ఆ రాత్రి అక్కడే బస చేసి 28వ తేదీన అక్కడ నుంచి నేరుగా గద్వాలలోని పోలింగ్ కేంద్రానికి చేరుకోనున్నారు.



గద్వాల నుంచి హైదరాబాద్‌కు బయలుదేరుతున్న కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు

ప్రమాదభరితంగా వాటర్ ట్యాంక్



పెచ్చులూడిన వాటర్‌ట్యాంకు కింది భాగం

వడ్డేపల్లి, మార్చి 25 : మునిసిపాలిటీ గ్రామమైన పైపాడు స్టేజీలో వాటర్ ట్యాంకు శిథిలావస్థకు చేరి ప్రమాదభరితంగా మారింది. వాటర్ ట్యాంక్ పైకప్పు పెచ్చులూడి పోయి ఇనుప ఊచలు తేలాయి. 30 సంవత్సరాల క్రితం నిర్మించిన ఈ ట్యాంక్ ద్వారా మద్దూరు, కలుకుంట్ల, బూడిదపాడు గ్రామాలకు తాగునీటిని సరఫరా చేస్తున్నారు. అది శిథిలావస్థకు చేరినా అధికారులు మరమ్మతులు చేపట్టడం లేదని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వాటర్ ట్యాంకుకు మరమ్మతు చేపట్టాలని, లేదా దానిని తొలగించి నూతన ట్యాంకు నిర్మించాలని గ్రామస్థులు, ప్రయాణికులు కోరుతున్నారు.

బ్యాలెట్ పద్ధతిలో ఎన్నికలు నిర్వహించాలి

▸ పాలమూరు అధ్యయన వేదిక కన్వీనర్ ఇక్బాల్‌బాషా

గద్వాల టౌన్, మార్చి 25 : అక్షరాస్యత శాతం తక్కువగా ఉండే మన దేశంలో ఎన్నికలను బ్యాలెట్ పద్ధతిలోనే నిర్వహించాలని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఎండీ ఇక్బాల్‌బాషా డిమాండ్ చేశారు. ఎన్నికల ఫలితాల్లో పారదర్శకత కోసం ఈవీఎంల స్థానంలో బ్యాలెట్ల ద్వారానే ఎన్నికలు నిర్వహించాలని దేశ ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నా పాలకులు పట్టించుకోవడం లేదని విమర్శించారు. వేదిక కో కన్వీనర్ డి.హనుమంతుతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈవీఎంలకు వ్యతిరేకంగా ఢిల్లీ వేదికగా ఏడాదికి పైగా జరుగుతున్న పోరాటాన్ని ప్రజల దృష్టికి తీసుకురావడంలో ప్రధాన మీడియా సంస్థలు విఫలం కావడం నిరాశ కలిగిస్తోందన్నారు. ఈవీఎంల ద్వారా జరిగే ఓటింగ్‌పై సాంకేతిక పరిజ్ఞానం ఉన్న మేధావులు సైతం అనుమానాలు వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ నేపథ్యంలో ఈవీఎంల రద్దు కోసం ప్రతిపక్ష పార్టీలు పోరాడకపోవడం సరికాదన్నారు. సంపన్న వైజ్ఞానిక దేశాలు కూడా బ్యాలెట్ విధానంతోనే ఎన్నికలు జరుపుకుంటుండగా, మన దేశంలో పాలకులు మాత్రం ఈవీఎంలపైనే ఆధార పడుతుండటం ఆందోళనకరమన్నారు.

బీఆర్ఎస్ నాయకుడికి నివాళి

ధరూరు, మార్చి 25 : ధరూరు మండలం ఉప్పేరు గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ముక్తార్ అలీ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి సతీమణి బండ్ల జ్యోతి సోమవారం గ్రామానికి వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబానికి అండగా ఉంటామని, అధైర్యపడొద్దని కుటుంబసభ్యులను ఓదార్చారు. ఆమె వెంట ఉప్పేరు సర్వారెడ్డి, హనుమంతు రెడ్డి, కురుమన్న, నాయకులు ఉన్నారు.

సోషల్ మీడియాపై నిఘా

▸ వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్‌లపై నిరంతర పర్యవేక్షణ ▸ జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక విభాగం



గద్వాల క్రైం, మార్చి 25 : త్వరలో జరగనున్న పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో సోషల్ మీడియాపై జిల్లా పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. సోషల్ మీడియాపై 24/7 నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఓటర్లను ప్రలోభ పెట్టినా, ఇబ్బందులకు గురి చేసేలా పోస్టులు పెట్టినా, నియమావళిని ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకోనున్నారు. ఇతరుల మనోభావాలను మనోభావాలను దెబ్బతీసేలా వాట్సాప్, ఫేస్‌బుక్, ట్విట్టర్ (ఎక్స్) తదితర సోషల్ మీడియాలో పోస్టులు పెడితే, ఎంతటి వారైనా చర్యలు తీసుకునేందుకు జిల్లా పోలీసులు ఏర్పాట్లు చేశారు. ఇందుకు జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక సెల్‌ను ఏర్పాటు చేశారు. వాట్సాప్, ఫేస్‌బుక్‌లలో ఎవరు, ఎటువంటి పోస్టింగ్‌లు పెడుతున్నారు, వాటి వల్ల శాంతిభద్రతలకు ఇబ్బంది కలుగుతుందా, ఇతరుల మనోభావాలను దెబ్బతీస్తున్నాయా తదితర విషయాలను ఆరా తీస్తున్నారు. వాట్సాప్ గ్రూపుల్లో ఎవరైనా అభ్యంతరకర పోస్టులు పెడితే, వారితో పాటు అడ్మిన్‌పై కూడా చర్యలు తప్పవంటున్నారు. ఒకవేళ అడ్మినే అలాంటి పోస్టులు చేసే కఠిన చర్యలుంటాయని చెప్తున్నారు. ఐపీసీ సెక్షన్ 153(ఏ) కింద మూడు నెలల నుంచి ఐదు సంవత్సరాల పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నారు.

గ్రూప్ అడ్మిన్ జాగ్రత్తగా ఉండాలి

పార్లమెంటు ఎన్నికల నేపథ్యంలో వాట్సాప్, ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్ తదితర సామాజిక మాధ్యమాలపై నిరంతరం నిఘా ఉంచాం. సోషల్ మీడియాలో ఎవ రైనా అభ్యంతరకరం, వివాదాస్పద పోస్టులు పెట్టినా, శాంతి భద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించినా కఠిన చర్యలు తీసుకుంటాం. నేరం రుజువైతే జైలు శిక్ష కూడా పడే అవకాశాలున్నాయి. ఈ విషయంలో గ్రూప్ అడ్మిన్ జాగ్రత్తగా ఉండాలి. లేకపోతే ఆయనే బాధ్యత వహించాల్సి వస్తోంది.

- రితిరాజ్, ఎస్పీ, గద్వాల

భక్తి శ్రద్ధలతో మహాపడిపూజ

ఉండవల్లి/ అలంపూర్ చౌరస్తా, మార్చి 25 : మండల కేంద్రంలోని మణికంఠ అయ్యప్పస్వామి ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి జన్మ నక్షత్రాన్ని పురస్కరించుకుని ఉదయం స్వామివారికి పంచామృతాభిషేకం, నెయ్యాభిషేకం, గణపతి, సుబ్రహ్మణ్వేశ్వర స్వామికి ప్రత్యేక అలంకరణ చేశారు. సాయంత్రం పదునెట్టాంబడికి గురుస్వాములు సూర్యకాంతారెడ్డి, చల్లా దామోదర్‌రెడ్డి, అర్చకుడు ఆంజనేయ శర్మ ఆధ్వర్యంలో మహాపడి పూజ నిర్వహించారు. మండల కేంద్రానికి చెందిన ఆర్ఎంపీ వైద్యుడు హన్మంతు దంపతులు పూజా సామగ్రిని సమకూర్చారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్నదానం చేశారు. అలంపూర్ చౌరస్తాలోని అంజనేయ స్వామి ఆలయంలో పౌర్ణమి వేడకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేశారు.

పిల్లలను బడికి పంపించాలి

▸ గట్టు ఎస్ఐ రామకృష్ణ

గట్టు, మార్చి 25 : పిల్లలను తప్పనిసరిగా బడికి పంపించాలని గట్టు ఎస్ఐ రామకృష్ణ తల్లిదండ్రులకు సూచించారు. చదువుకుంటేనే సమగ్ర జ్ఞానం లభిస్తుందని చెప్పారు. బాలల హక్కుల పరిరక్షణ వేదిక ఆధ్వర్యంలో సోమవారం మండల పరిధిలోని చమన్‌ఖాన్‌దొడ్డిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏస్ఐ రామకృష్ణ మాట్లాడుతూ బాల్యవివాహాలు చేయడం నేరమన్నారు. చదువుకుంటేనే బతుకు మారుతుందని, ఉద్యోగం కోసం కాకుండా జ్ఞానం కోసం చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీఆర్‌పీఎఫ్ కన్వీనర్ జమ్మన్న, ఎంవీఎఫ్ ఫౌండేషన్ మొబిలైజర్ నరసన్న, వలంటీర్లు పాల్గొన్నారు.

డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త



చెత్త పేరుకుపోవడంతో ఆగిపోయిన మురుగు నీరు

గద్వాల అర్బన్, మార్చి 25 : పట్టణంలోని కుంటవీధిలో ఉన్న పెద్ద కాలువ చెత్తా చెదారంతో నిండిపోయింది. దీంతో మురుగునీరు పారక దుర్వాసన వెదజల్లుతోంది. మూడు కాలనీ నుంచి వచ్చే మురుగు నీరు ఇదే కాలువ ద్వారా వెళ్లాల్సి ఉంటుంది. డ్రైనేజీలో చెత్త పేరుకుపోవడంతో నీరు పారక దోమలు కూడా అధికమయ్యాయని, దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోయారు. ఇప్పటికైనా వార్డు కౌన్సిలర్, మునిసిపల్ అధికారులు చొరవ తీసుకుని కాలువను శుభ్రం చేయించాలని కోరుతున్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరిన బీఆర్ఎస్ నాయకులు

ఇటిక్యాల మార్చి 25 : ఇటిక్యాల మండలానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కొప్పుల లక్ష్మీనారాయణరెడ్డి సోమవారం సాయంత్రం అలంపూరు ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్ఏ సంపత్‌కుమార్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆయనతో పాటు ఉదండాపురం యుగేందర్‌రెడ్డి, వేముల శ్యామ్‌సుందర్, నలుగురు ఎంపీటీసీ సభ్యులు హైదరాబాద్‌లోని సంపత్‌కుమార్ స్వగృహానికి వెళ్లారు. ఆయన వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ అలంపూరు నియోజకవర్గ అధ్యక్షుడు రవి, సీనియర్ నాయకుడు ఇస్మాయిల్ తదితరులున్నారు.